# మేకార్తి దినపత్రిక

PRGI NO: TGTEL/25/A2356

శనివారం 18-04-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 223 | WWW.MEKARTHI DINAPATRIKA.COM



జర్నలిస్టులకు ఆహ్వానం

నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో

అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు

జర్నలిస్టులు కావలెను

సంప్రదించాల్సిన నెంబర్స్

9014726022,6302041083


# మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు: లోక్‌సభలో మోదీ

- హక్కు మాత్రమే, గిఫ్ట్ కాదు: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం అనేది వారికి ఇచ్చే బహుమతి కాదని, అది వారి హక్కు అని ప్రధాని స్పష్టం చేశారు.
- వికసిత్ భారత్‌లో పాత్ర: దేశాభివృద్ధి అంటే కేవలం మౌలిక సదుపాయాలు మాత్రమే కాదని, మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ 'వికసిత్ భారత్' అవుతుందని పేర్కొన్నారు.
- రాజకీయ మనుగడ: మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలకు భవిష్యత్తులో మనుగడ ఉండదని, వారిని మహిళలు క్షమించరని విపక్షాలను హెచ్చరించారు.
- డీలిమిటేషన్‌పై భరోసా: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని, ఉత్తర-దక్షిణ అనే భేదభావం తమకు లేదని హామీ ఇచ్చారు.
- క్రెడిట్ అక్కర్లేదు: ఈ బిల్లు విషయంలో తనకు ఎలాంటి పేరు ప్రతిష్టలు అవసరం లేదని, విపక్షాలే ఆ క్రెడిట్ తీసుకోవచ్చని.. కానీ బిల్లు ఆమోదానికి సహకరించాలని కోరారు.




: మహిళా రిజర్వేషన్లను తీసుకురావడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని పేర్కొన్నారు . చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన 3 కీలక బిల్లులను కేంద్రం నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిపై చర్చలో భాగంగా ప్రధాని మోదీ సభలో ప్రసంగించారు. మహిళా రిజర్వేషన్ల ను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు.

**గిఫ్ట్ కాదు.. ఇది హక్కు**

"దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది.

పేజి 2లో ▶



దేశంలో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టేందుకు నేడు పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత.. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. అనంతరం వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. ఈ బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్‌కు పట్టుబట్టాయి. అందుకు స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251 ఓట్లు పోలయ్యాయి. 185 మంది దీనికి వ్యతిరేకంగా ఓటేశారు. మెజార్టీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కేంద్రం ఈ మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. ఈ బిల్లులపై చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు.

పేజి 2లో ▶

## అలాగైతే రాష్ట్రం ఏర్పాటుకు భాజపా ఎందుకు మద్దతిచ్చింది?: హరీశ్‌రావు



హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటును ఇండియా–పాకిస్థాన్ విభజనతో పోల్చిన భాజపా ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ప్రజలను అవమానించారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ఇండియా–పాక్ విభజన లాంటిదైతే భాజపా ఎందుకు మద్దతు తెలిపిందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు."తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం దశాబ్దాల పోరాట ప్రతిఫలం. వేలాది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితం. మహోన్నత ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం అవమానించడమే. తేజస్వి వ్యాఖ్యలపై భాజపా అధిష్ఠానం వైఖరి ఏంటో చెప్పాలి. ప్రధాని కూడా ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటుపై విషం చిమ్మారు. భాజపా, కాంగ్రెస్ ఎంపీలు గుడ్లప్పగించి చూడటం


# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామి

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మేడిన్ తెలంగాణ' మార్క్

అమెరికా పెట్టుబడిదారులకు తెలయి చేయండి

అమెరికన్ నేషనల్ వార్ కాలేజీఇ బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



## ఈ నెల 25 నుంచి 27 వరకు తిరుమలలో శ్రీపద్మావతి పరిణయోత్సవాలు

తేదీలు: ఏప్రిల్ 25 నుండి 27 వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి.

వేదిక: తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.



2లో..

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది మృతి, 13 మందికి గాయాలు



2లో..

## తెలంగాణ ఏర్పాటును కించపరిచిన ఆ ఎంపీని బర్తరఫ్ చేయాలి: పొన్నం



2లో..

- తెలంగాణ అస్తిత్వం: ఎన్నో ఆత్మత్యాగాలు చేసి, ప్రజాస్వామిక పద్ధతిలో తెలంగాణను సాధించుకున్నామని మంత్రి గుర్తుచేశారు.
- తేజస్వి సూర్యపై ఆగ్రహం: తెలంగాణ ఏర్పాటును ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇది రాష్ట్ర అస్తిత్వాన్ని కించపరచడమేనని మండిపడ్డారు.
- బర్తరఫ్‌కు డిమాండ్: తెలంగాణను అవమానించిన ఆ ఎంపీని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు.

## మత్స్యకారులను రెచ్చగొట్టేలా జగన్ తీరు: కొల్లు రవీంద్ర



నెల్లూరు: జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో మత్స్యకారులను రెచ్చగొట్టేలా వైకాపా అధినేత జగన్ వ్యవహరిస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. నెల్లూరు పర్యటనలో అడుగడుగునా.. ప్రాంతీయ విభేదాలు సృష్టించేలా మాట్లాడారని మండిపడ్డారు. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకం వల్లే.. తమిళనాడు బోట్లు ఏపీ జలాల్లోకి వస్తున్నాయన్నారు. జూన్ నాటికి స్పీడ్ బోట్లతో తమిళనాడు బోట్లను కంట్రోల్ చేసి, మత్స్యకారులకు ఇబ్బంది లేకుండా చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు?: లోకేశ్

- పరిశ్రమల తరలింపు: దేశ రక్షణకు అత్యాధునిక బోట్లు తయారు చేసే కంపెనీ రాష్టానికి వస్తే, దాన్ని స్వాగతించాల్సింది పోయి తరిమేస్తానని జగన్ అనడాన్ని లోకేశ్ తప్పుబట్టారు.
- మత్స్యకారుల అభివృద్ధి: మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తుంటే ఆనందించాల్సింది పోయి, వాటిని అడ్డుకుంటానని చెప్పడం "సైకోయిజం" అని విమర్శించారు.
- వ్యక్తిగత విమర్శలు: తల్లి, చెల్లిని బయటకు పంపేసిన జగన్కు దైవభక్తి, దేశప్రేమ లేవని; కేవలం ద్వేషం మాత్రమే ఉందని ఆయన ఆరోపించారు.



2లో..

# సంపాదకీయం

## ‘మహిళా సాధికారత’ పేరిట మరో రాజకీయం!

మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నట్టు చెబుతున్నప్పటికీ డీలిమిటేషన్ ప్రక్రియను ముందస్తుగా అమలుపరచడమే ప్రభుత్వ లక్ష్యం. అసోం, కశ్మీర్ రాష్ట్రాల్లో ఇటీవల నియోజకవర్గాల పునర్విభజన అనుభవాల ఆధారంగా చూస్తే.. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు 2029 లోక్‌సభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా ఉండేలా జరుగుతుందనడంలో సందేహం లేదు.

రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి ‘నారీ శక్తి వందన్ అధినియమ్’ (మహిళా రిజర్వేషన్ చట్టం) అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో నేటి నుంచి మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను మోదీ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక సమావేశాల సమయ సందర్భాలను గమనిస్తే.. ఎక్కువ మంది ఓటర్లను సంపాదించుకోవడానికి మోదీ ప్రభుత్వ వ్యూహాత్మక ఎత్తుగడగా వాటిని భావించక తప్పదు. డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)ను 2029 సార్వత్రిక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని ముందస్తు పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. ఎందుకీ వేగిరపాటు? ఎన్నికలలో విజయావకాశాలను పెంపొందించుకుని, అధికారాన్ని సుదీర్ఘకాలం నిలబెట్టుకోవడానికే కాదూ? ఎన్నికల ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రక్రియలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పాలకపక్షం చేస్తున్న ప్రయత్నాలలో భాగమే ఈ ప్రత్యేక సమావేశాలు. భారతదేశంలో సామాజిక ప్రజాస్వామ్యం లేదని, అది లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోవడం కష్టమని రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే చేసిన హెచ్చరికను ఈ సందర్భంగా మరొకసారి గుర్తు చేసుకోవలసిన అవసరమున్నది.

అయితే అసలు విషయం ఇక్కడే ఉంది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి.

‘మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు పార్లమెంటు ప్రత్యేకంగా సమావేశమవనున్నది. దీనిని ఓ శాసన సంబంధమైన కార్యక్రమంగా భావిస్తే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తగ్గించినట్టే! కోట్లాది భారతీయ మహిళల ఆకాంక్షలకు ఆ బిల్లు ఒక ప్రతిబింబం. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం’ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అయితే కోట్లాది మహిళల ఆకాంక్షలను వ్యక్తీకరించిన బిల్లును వారి పరిశీలనకు ఎందుకు నివేదించడం లేదో ఆయన చెప్పలేదు. ‘మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. ఇది ఇంకెంత మాత్రం వాయిదా వేసేందుకు వీల్లేని విషయం’ అని ప్రధాని మోదీ అన్నారు. అయితే మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించడాన్ని 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎందుకు అమలుపరచలేదో, 2029 లోక్‌సభ ఎన్నికల్లో విధిగా అమలుపరిచేందుకు ఎందుకు సంకల్పించుకున్నారో ఆయన చెప్పలేదు.

‘చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉంది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబర్‌లో నారీ శక్తి వందన్ అధినియమ్‌ను పార్లమెంటు ఆమోదించింది’ అని కూడా మోదీ అన్నారు. మరి ఆ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే ప్రతిపాదిత కొత్త సవరణ బిల్లు విషయమై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలన్న విపక్షాల సూచనను ప్రధానమంత్రి ఎందుకు అంగీకరించలేదు? తమిళనాడు, పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలు వారం రోజుల్లో జరగనున్న తరుణంలో ఈ ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నది కూడా ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. తమ రాజకీయ లక్ష్యాలకు మహిళా రిజర్వేషన్ అంశాన్ని ఉపయోగించుకునేందుకే ఈ ప్రత్యేక సమావేశాలను తలపెట్టారనడం సత్యదూరమేమీ కాదు. ప్రతిపక్షాల అభ్యంతరాలను తిరస్కరించడం ద్వారా, అవి మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని ప్రజలకు చెప్పడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదని చెప్పవచ్చు. ఇంకా ఘోరమైన విషయమేమిటంటే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నిర్వహణ ద్వారా ఎంపీలు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వీలు లేకుండా చేయాలనే యోచన కూడా ప్రభుత్వానికి ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఎవరూ తనను ప్రశ్నించకూడదని, ప్రశ్నించినా సమాధానమివ్వాల్సిన అవసరం తమకు లేదనే దురహంకార వైఖరి ఒకటి ప్రభుత్వంలో బాగా ద్యోతకమవుతోంది.

మహిళలకు మూడింట ఒక వంతు సీట్లను రిజర్వ్ చేయాలని నిర్దేశిస్తున్న నిబంధన ఒకటి ఇప్పటికే మన రాజ్యాంగంలో ఉన్నది. అయితే ఆ నిబంధనలో చాలా లొసుగులు ఉన్నాయి. ఈ రిజర్వ్డ్ సీట్లను రాష్ట్రాల వారీగా కేటాయింపులు ఎలా ఉండాలో ఆ నిబంధన స్పష్టంగా పేర్కొనలేదు. నియోజకవర్గాల భౌగోళిక రిజర్వేషన్ గురించి మాత్రమే ఆ నిబంధన నొక్కి చెప్పింది. అయితే ఈ రిజర్వేషన్ విధానం చట్ట సభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు ఉత్తమ మార్గం కాదు. అది మహిళా రాజకీయ సాధికారతకు దోహదం చేయదు. 2024 లోక్‌సభ ఎన్నికలలోనే ఆ భౌగోళిక రిజర్వేషన్ విధానాన్ని అమలుపరిచి ఉండవల్సింది. ప్రతిపక్ష నాయకులు అందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు కూడా. అయితే ప్రభుత్వం ఒక వింతైన, అనవసరమైన నిబంధననొకదాన్ని 2023 నాటి సవరణ చట్టంలో చేర్చింది. మహిళా రిజర్వేషన్లు తదుపరి జనాభా గణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగిన పిమ్మట అమల్లోకి రావాలని ఆ నిబంధన పేర్కొంది. 2026 అనంతరం జరిగే జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలవుతుందని మరొక రాజ్యాంగ సవరణ స్పష్టం చేసింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే తొలుత కొత్త జనాభా గణన జరగాలి, దాని ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలి. 2023లో ఈ నిర్ణయం జరిగినప్పుడు 2026 అనంతర జనాభా గణన అంటే అది 2031లో జరిగేదయి ఉంటుందనేది అందరి భావన. నియోజకవర్గాల పునర్విభజనకు రెండు నుంచి మూడు సంవత్సరాల సమయం పట్టవచ్చు. ఈ దృష్ట్యా మహిళా రిజర్వేషన్ అమలు అనేది 2039 సంవత్సరానికి ముందు జరిగే అవకాశం లేదని విదితమయింది. 2023 నాటి రాజ్యాంగ సవరణ ద్వారా అంతిమంగా ‘చట్ట సభలలో మూడింట ఒక వంతు సీట్లు మీకు రిజర్వ్ అవుతా’యని మహిళలకు, ‘మీ రాజకీయ జీవితకాలంలో మహిళా రిజర్వేషన్లు అమల్లోకి రావు’ అనే హామీని పురుష రాజకీయవేత్తలకు మోదీ ప్రభుత్వం ఆ సవరణ ద్వారా ఏకకాలంలో హామీ ఇచ్చింది!

చట్టసభలలో మహిళలకు న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం ఎట్టకేలకు పూనుకోవడం హర్షణీయమే. ప్రభుత్వ సంకల్పంలో పరిపూర్ణ చిత్తశుద్ధి ఉన్నట్టయితే రాజ్యాంగానికి ఒక సాధారణ సవరణతో ఆ లక్ష్యం నెరవేరుతుంది. మహిళా రిజర్వేషన్‌ను జనాభా గణన, డీలిమిటేషన్‌తో ముడిపెట్టిన అధికరణ 334ఎ(1)ను రద్దు చేయడమే ఆ సవరణ. లాటరీ ద్వారా మహిళలకు సీట్ల రిజర్వేషన్‌ను నిర్ణయించడానికి వీలు కల్పించే ఒక నిబంధనను ఆ ప్రతిపాదిత రాజ్యాంగ సవరణలో చేర్చాలి. తద్వారా 2029 సార్వత్రిక ఎన్నికలలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలుచేసే వెసులుబాటు లభిస్తుంది. ఈ రిజర్వేషన్ లబ్ధిని ఓబీసీ మహిళలకు సైతం సమకూర్చేందుకు పాలక, ప్రతిపక్షాలు నిబద్ధమైతే మహిళా కోటాలో ఎస్సీ, ఎస్టీలకు మూడింట ఒక వంతు సమాంతర రిజర్వేషన్ సదుపాయాన్ని ఓబీసీ మహిళలకూ విస్తరింపజేయాలి. బహుశా, మన రాజకీయపక్షాలు ఇందుకు సుముఖత

## ఈ నెల 25 నుంచి 27 వరకు తిరుమలలో శ్రీపద్మావతి పరిణయోత్సవాలు

మొదటిపేజీ తరువాయి

తిరుమల: శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఏప్రిల్ 25 నుంచి 27 తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో తొలిరోజు శ్రీమలయప్పస్వామివారు గజవాహనం, రెండోరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడ వాహనంపై విహరించనున్నారు.మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. శ్రీ పద్మావతి పరిణయోత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 25 నుంచి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను తితిదే రద్దు చేసింది.

## కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. 8 మంది మృతి, 13 మందికి గాయాలు

మొదటిపేజీ తరువాయి

ఎమ్మిగనూరు: కర్నూలు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద బొలెరో వాహనం-రెడీమిక్స్ లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా.. 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మిగనూరులోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలోనే ఐదుగురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముగ్గురు చనిపోయారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, బాలిక ఉన్నారు. కర్ణాటకలోని చిక్‌మంగళూరుకు చెందిన భక్తులు మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులు కుమార్ (60), దీపిక వీణ (35), సునీల్ (40), బెల్లి (3), పుట్టమ్మ (60), మీనాక్షి (50), తాయమ్మ (60), లోలాక్షిగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**మృతులకు ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ సంతాపం**

రోడ్డు ప్రమాదంపై ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ స్పందించారు. మృతులకు సంతాపం తెలిపారు. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ రూ.2 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

ఈ రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల విచారణ వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై ఏపీ మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

## జగన్ మోహన్‌రెడ్డి సర్..

మొదటిపేజీ తరువాయి

అమరావతి: దేశ రక్షణకు అధునాతన బోట్లు తయారు చేసే కంపెనీ రాష్ట్రానికి వస్తే స్వాగతించాల్సింది పోయి.. తరిమేస్తానని జగన్ అనడమేంటని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. ఇదేం రాక్షస మనస్తత్వమని అన్నారు. మత్స్యకారుల పిల్లలకు ఉద్యోగాలు వస్తాయంటే.. ఆనందించాల్సింది పోయి, అడ్డుకుంటాననడం ముమ్మాటికీ సైకోయిజమేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

“తల్లిని తరిమేసి, చెల్లిని గెంటేసిన జగన్‌కు దైవం అంటే భక్తి లేదు. దేశం అంటే ద్వేషం. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఉద్యోగాలు వస్తున్నాయంటే దోపిడీ అని గగ్గోలు పెడుతున్నారు. నిలువెల్లా స్వార్థం, మనసంతా విధ్వంసం నిండి ఉన్నాయి. అమరావతిని మార్చేస్తాం.. కట్టినవన్నీ కూల్చేసి, కంపెనీలన్నీ వెళ్లగొడతామంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి సర్.. ఇవేం రాక్షస చేష్టలు?” అని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణ ఏర్పాటును కించపరిచిన ఆ ఎంపీని బర్తరఫ్ చేయాలి: పొన్నం



మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఆత్మ త్యాగాలు చేసి, ప్రజాస్వామికంగా తెలంగాణ సాధించుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే రాష్ట్ర భాజపా నేతలు మౌనంగా కూర్చున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “తెలంగాణ ఏర్పాటును అవమానించేలా భాజపా ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడారు. ఆయన అవమానిస్తుంటే కిషన్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరం. తెలంగాణను అవమానించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పాలి. తెలంగాణ ఏర్పాటును ఇండియా-పాక్ విభజనతో పోల్చిన ఎంపీని బర్తరఫ్ చేయాలి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాస్తున్నా. 2001లో మూడు రాష్ట్రాలు ఇచ్చిన భాజపా.. తెలంగాణ ఎందుకు ఇవ్వలేదు?” అని పొన్నం ప్రశ్నించారు.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్..

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం (ఏప్రిల్ 17) సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించనున్నట్లు సభాపతి తెలిపారు.

జనాభా లెక్కైతే 11 రాష్ట్రాలకు లబ్ధి

ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతోపాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ- అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టారు. ఇక, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. వీటిపై లోక్‌సభలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధాని మోదీ ఈ సాయంత్రం లోక్‌సభలో ప్రసంగిస్తారు.

ఇందులో ఒకటి రాజ్యాంగ సవరణ బిల్లు. మిగతా రెండూ చట్టపరమైన బిల్లులు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68 మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండియా కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.

## మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు: లోక్‌సభలో మోదీ

మొదటిపేజీ తరువాయి

దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు” అని మోదీ వ్యాఖ్యానించారు.

**ఆ పార్టీలకే మనుగడ..**

“మహిళా రిజర్వేషన్ల కోసం 30 ఏళ్ల పాటు ప్రయత్నాలు జరిగినా గతంలో ఇది సాకారం కాలేదు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లే. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిని మహిళలు క్షమించరు. బిల్లును వ్యతిరేకించే పార్టీలకు, నేతలకు మహిళలు బుద్ధి చెబుతారు. సమయం చూసి దెబ్బకొడుతారు. మహిళా బిల్లులకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది” అని విపక్షాలకు ప్రధాని చురకలంటించారు.

**దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు..**

“ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం” అని మోదీ స్పష్టం చేశారు.

**నాకు క్రెడిట్ వద్దు.. మీరే తీసుకోండి**

“ఈ బిల్లుతో దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం” అని మోదీ విపక్షాలను కోరారు.

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి



మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని అమెరికా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. డ్రోన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా 'నేషనల్ వార్ కాలేజ్' బృందంతో గురువారం మంత్రి సమావేశమయ్యారు.యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో స్కిల్డ్ వర్క్ ఫోర్స్ సిద్ధంగా ఉందని.. 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమెరికాతో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. టెక్నాలజీ, రీసెర్చ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరోస్పేస్ రంగం ఏటా సగటున 30 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. ఎగుమతుల్లో 103 శాతం సీఏజీఆర్‌తో తెలంగాణ దూసుకుపోతోంది. రాకెట్ల నుంచి శాటిలైట్ల వరకు అన్ని ఉత్పత్తులపై 'మేడ్ ఇన్ తెలంగాణ' ముద్ర పడుతోంది. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కి పైగా ఎంఎస్‌ఎంఈలతో తెలంగాణ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదుగుతోంది. 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ టాప్ స్థానంలో నిలిచింది. వరుసగా ఐదు సార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును అందుకోవడం తెలంగాణ సాధించిన మరో విజయం.

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగంలో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే... 2024-26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్‌ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు.÷నాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా,తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్ మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యం

**– రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్**

**– ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా సిరిసిల్లలో అరైవ్.. అలైవ్ కార్యక్రమం**

**– హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**

**– డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్స పై శిక్షణ, అవగాహన**

మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ 17 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ పేర్కొన్నారు.ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ,రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్ లో జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ మాట్లాడుతూ..ప్రమాదాలు జరిగినప్పుడు ముందుగా స్పందించి ప్రాణాలు కాపాడేది వాహనాల డ్రైవర్లేనని తెలిపారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనల మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,అలాగే విద్యార్థుల రవాణాలో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. 'రహావీర్' పథకం కింద ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను సమీప ప్రధాన రహదారుల వెండి ఉన్న ఆసుపత్రులకు తరలిస్తే, వారికి వారం రోజులపాటు ఉచిత చికిత్స అందిస్తూ.. రూ.1,50,000 వరకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని వివరించారు.ప్రమాద సమయంలో భయపడకుండా బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి 'రహావీర్' పథకం కింద రూ.25,000 ప్రోత్సాహకం ఇస్తామని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని, ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణలో రోజుకు సుమారు 70 రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయని అందులో 20 వరకు మరణాలు జరుగుతున్నాయని వెల్లడించారు.ఓవర్ స్పీడ్, తప్పుగా ఓవర్ టేకింగ్ చేయడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వాహనాలు 80 కిమీ వేగ పరిమితి లోపలే నడపాలని, ముఖ్యంగా ప్రధాన రహదారులపై ఉన్న స్పీడ్ సైన్ బోర్డులను పాటించాలని సూచించారు. సీట్ బెల్ట్ ధరించకపోవడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం వలన ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని



వెల్లడించారు. దేశంలో గత ఏడాది 4,70,000 ప్రమాదాలు జరిగాయని,దానిలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. యుద్ధాలు, వ్యాధుల ఇతర కారణాలతో ఎక్కువ మరణాలు జరగడం లేదని, రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది మృతి చెందుతున్నారని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు వీధిన పడుతున్నాయని పేర్కొన్నారు. తమ కుటుంబ, పిల్లల బాధ్యతను గుర్తు పెట్టుకొని జాగ్రతగా వెళ్లాలని పేర్కొన్నారు. ప్రతి నెలా రోడ్డు సేఫ్టీ కమిటి మీటింగ్ ఆర్అండ్ బీ,పీఆర్,పోలీస్,రవాణా శాఖా,ఆర్టీసీ అధికారులతో సమావేశం పెడుతున్నామని,బ్లాక్ స్పాట్స్ గుర్తింపు, నివారణ చర్యలు,సైన్ బోర్డ్స్ ఏర్పాటు తదితర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. స్కూల్ ఆటోలు, బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని స్పష్టం చేశారు. డ్రైవర్లకు కంటి పరీక్షలతో ఎంతో మేలని, వైద్యుల సూచన మేరకు కంటి అద్దాలు వాడాలని సూచించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ...ప్రస్తుతం ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే అవుతున్నాయని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అలాగే జిల్లాలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలో రోడ్ సేఫ్టీ కమిటి ఆధ్వర్యంలో జిల్లాలో 08 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగింది. కొదురుపాక బ్రిడ్జ్ చౌరస్తా, నందికమాన్ చౌరస్తా, వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ చౌరస్తా,సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా, పెద్దూర్,ఎల్లారెడ్డిపేట హెచ్పి పెట్రోల్ బాంక్ వద్ద, తంగళ్ళపల్లి పద్మనగర్,, సారంపల్లి లుగా గుర్తించడం జరిగిందని ఆయా ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టడం జరిగిందని వాహనాదాహరులు జాగ్రత్తగా వెళ్లాలన్నారు. జిల్లాలో వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇతర కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు.మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సైకిల్ నడిపే పిల్లలు దానికి వాడే హెల్మెట్ వినియోగించాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపవద్దని ఒకవేళ నడిపి పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవ్ చేయవద్దని సూచించారు. ప్రతి వాహనదారుడు సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని, మేజర్లకే జాగ్రత్తలు చెపుతూ వాహనాలు ఇవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం వాహనాల డ్రైవర్లతో కలసి రహదారి భద్రత పై ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మహేష్ కుమార్, సీ.ఐలుశ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్,మధుకర్,ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్,ఎస్.ఐ లు, పోలీస్, రవాణా శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల తాహసిల్దార్ కి వినతి పత్రం అందజేత.

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేర్యాల మండల తహసీల్దార్ దిలీప్ నాయక్ ని వారి కార్యాలయంలో కలిసి ఉద్యోగ, ఉపాధ్యాయ మరియు పెన్షనర్ల పెండింగ్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలుపడం జరిగింది.

**ప్రధాన డిమాండ్లు:**

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. పెన్షనర్లకు రావాల్సిన ఇతర ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించాలి. హెల్త్ కార్డులను మే నెలలో మంజూరు చేయాలని

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మా సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో భాగస్వామ్య సంఘాల నాయకులు గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎస్ మండల అధ్యక్షుడు కే వెంకట నరసింహా రెడ్డి, మండల అధ్యక్షుడు తలారి కనకయ్య, మండల అధ్యక్షులు గదరాజు నర్సింహులు, అధ్యక్షులు శ్రీనివాస్, మండల అధ్యక్షులు అంబాల వెంకట్, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రఘుపతిరెడ్డి యూనియన్ మండల అధ్యక్షులు కర్రోల్ల విజయ్, మహిళా ఉద్యోగులు ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్ట్రెస్ మేనేజ్మెంట్ - ప్రిపరేషన్ ఆఫ్ ఎగ్జామ్స్ పై ఎక్స్టెన్షన్ లెక్చర్



మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీ గజానంద్ లెక్చరర్ ఇన్ హిందీ ఆధ్వర్యంలో డాక్టర్ యెలగొండ ఆంజనేయులు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గంభీరావుపేట మరియు ప్రముఖ సైకాలజిస్ట్ విద్యార్థిని విద్యార్థులకు ఎక్స్టెన్షన్ లెక్చర్ ఆన్ స్ట్రెస్ మేనేజ్మెంట్– ప్రిపరేషన్ ఆఫ్ ఎగ్జామ్స్ నిర్వహించారు.

విద్యార్థినీ, విద్యార్థులు రాబోయే ఎగ్జామ్స్ లో ఎలాంటి మెలకువలతో ప్రిపరేషన్ సాగించాలి, ఎగ్జామ్స్ రాసేటప్పుడు ఏ విధంగా రాస్తే ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది, ఏకాగ్రతతో ఎన్నిసార్లు ఎలా చదవాలి, ఇతర ఆలోచనలతో చదువుపై ఏ విధంగా పట్టుకోల్పోతామో, అందమైన చేతిరాతను ఎలా సొంతం చేసుకోవాలి దాని ప్రయోజనాలు, అత్యుత్తమ మార్కులతో ఎలా రాణించవచ్చును తదితర విషయాలపై తగు ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పాపారావు లెక్చరర్ ఇన్ తెలుగు, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్ అనిల్, రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, విద్యార్థులు తదితర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# డాక్టరేట్ సాధించిన ఐనాపూర్ గ్రామ యువకుడు కర్రోల్ల బిక్షపతి.

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

సిద్ధిపేట జిల్లా, కొమురవెల్లి మండలం, ఐనాపూర్ గ్రామానికి చెందిన కర్రోల్ల బిక్షపతి గారు డాక్టరేట్ పట్టా సాధించిన సందర్భంగా గ్రామస్తులు యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ కర్రోల్ల బిక్షపతి మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ పి. కమలాకర్ ఆధ్వర్యంలో Studies on Phytochemical Profiling, Antimicrobial, Antioxidant and Wound healing Efficacy of Acalypha malabarica In Vitro and In Vivo Approach అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు.వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ తనను చదివించిన తల్లితండ్రులు కర్రోల్ల యాదయ్య, కనకమ్మ కష్టసాధన, కుటుంబ సభ్యుల త్యాగం తన విజయానికి పునాది అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవ




చేయడం తన లక్ష్యమని తెలిపారు.బిక్షపతి తన విద్యను జడ్‌పీహెచ్ఎస్ ఐనాపూర్‌లో పదవ తరగతి వరకు, మహర్షి జూనియర్ కళాశాల చేర్యాలలో ఇంటర్మీడియట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్ధిపేటలో డిగ్రీ, సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పీజీ, సేయింట్ పీటర్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, కాకతీయ యూనివర్సిటీ హన్మకొండ నుండి బి.ఎడ్ పూర్తి చేశారు. తెలుగు మీడియం నుండి వచ్చిన తనకి పీజీ చదువులో డా. ఇంద్రసేనారెడ్డి, డా. జానకి రామయ్య మార్గదర్శకత్వంలో యూనివర్సిటీ ర్యాంక్ సాధించడం విశేషం. పీజీ తర్వాత కుటుంబ పరిస్థితుల కారణంగా ఒకవైపు ప్రైవేట్ కళాశాలలో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్‌గా పని చేస్తూనే కుటుంబానికి తోడుగా నిలిచి, మరోవైపు పట్టుదలతో పీహెచ్డీ పూర్తి చేయడం ఆయన సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతం మైనారిటీ గురుకుల కళాశాల, నర్సాపూర్‌లో బోటనీ జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా కర్రోల్ల బిక్షపతి మాట్లాడుతూ, తన ప్రయాణంలో తోడ్పడిన ప్రొఫెసర్స్, ఉపాధ్యాయులు, యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు, గ్రామ యువత, కుటుంబ సభ్యులు, మిత్రబృందం మరియు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన విజయాన్ని గుర్తించి సన్మానం చేసిన కొమురవెల్లి ఎస్ఐ తోట మహేష్ కుమార్ , ఐనాపూర్ గ్రామ సర్పంచ్ ఎరుపుల కళ్యాణి కృష్ణ , ఉపసర్పంచ్ మల్లం శ్రీనివాస్, వార్డు సభ్యులు మరియు కొమురవెల్లి కానిస్టేబుల్ మేరుగు సతీష్, సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం, అంబేద్కర్ సంఘాల నాయకులు యూత్ సభ్యులు పెయింటర్ అసోసియేషన్ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసారు,

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి

**– అంబేద్కర్ సంఘాల జిల్లా ఉపాధ్యక్షులు బండ రమేష్**

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్ గంభీరావుపేట దమ్మనపేట వివిధ గ్రామాల రైతులు కోసిన వరి ధాన్యం ను పరిశీలించిన అంబేద్కర్ సంఘాల జిల్లా ఉపాధ్యక్షులు బండ రమేష్ ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తెచ్చి 15 రోజులు అవుతున్న ఇంతవరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదని వర్షాలు పడే సూచన ఉన్నదని ఆరుగాలం పండించిన పంటను రైతులు నష్టపోతారని ఆయన అన్నారు కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆయన అన్నారు

# కృషి శతకం పుస్తకావిష్కరణకు కరపత్రం ఆవిష్కరించిన ఉపాధ్యాయబృందం.

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ఉన్నత పరిషత్ పాఠశాల లింగన్నపేట పాఠశాలలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్సకుర్మ రిషిక రాసిన కృషిశతకం ఈనెల 20 తారీకున పాఠశాల ప్రాంగణంలో పుస్తకావిష్కరణ మహోత్సవం ఉన్నట్టు దానికి సంబంధించిన కరపత్రాన్ని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించారు. ఇట్టి పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు కసిరెడ్డి వెంకటరెడ్డి , జిల్లా విద్యాశాఖాధికారి బొల్గం జగన్ మోహన్ రెడ్డి సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఛైర్మన్ సుభద్ర, అబ్రవేణి నర్సింలు మరియు బాల సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, ఉండ్రాళ్ళ రాజేశం,వరుకోలు లక్ష్మయ్య,వాసరవేణి పర్షరాములు హాజరవుతారని ప్రధానోపాధ్యాయులు సంటి గంగారాం తెలిపారు.రిషిక కుసాహిత్యంలో చిన్న వయసులో శతకం రాయడం గర్వకారణం 9వ తరగతి చదువుతున్న రిషిక ఇంత చిన్నవయసులో సాహిత్యంలో ఉన్నత స్థాయిగా శతకం రాయడం గర్వంగా ఉందని, లింగన్న పేటలో వాసి (ప్రస్తుతం అమెరికా)అయిన బాలన్నగారి ఆనందరావు పుస్తక ముద్రణకు ఆర్థిక సాయం అందించినందుకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే రిషికను శతకం రాసే




స్థాయికి తీసుకు వచ్చిన తెలుగు ఉపాధ్యాయులు,కవి కాల్వ రాజయ్య కృషి గొప్పదని కొనియాడారు.అదే విధంగా మరో తెలుగు ఉపాధ్యాయులు యం.నరేందర్ మరియు ఉపాధ్యాయ బృందం అందరి ప్రేరణ గొప్పదని తెలుపుతూ ఇట్టి కార్యక్రమంలో అందరూ పాలు పంచుకొని విజయవంతం చేయాలని తెలిపారు.

# ఫోటో స్టూడియోలో బంద్ విజయవంతం.

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



రాష్ట్ర వ్యాప్తంగా ఫోటో గ్రాఫీ ముడి సరుకులు పెరిగినందున, సిద్దిపేట జిల్లా ఫోటోగ్రఫీ యూనియన్ నాయకులు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఫోటో స్టూడియో లు బందు ప్రకటించిన సందర్భంగా, చేర్యాల మండల ఫోటోగ్రఫీ యూనియన్ అధ్యక్షులు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఫోటో స్టూడియో షాపులను స్వచ్ఛందంగా యూనియన్ సభ్యులు పాల్గొని షాపులను బందు చేయడం జరిగింది.

# కుల గణన నివేదిక ప్రకారం

**- మాదిగల జనాభా శాతానికి తగినట్టుగా 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలి.**
**- మంద కృష్ణ మాదిగ మాటలు కుల గణన రిపోర్ట్ ద్వారా నిజమయ్యాయి.**
**- ఆనాడు 9% రిజర్వేషన్ ను స్వాగతించిన వాళ్ళు జాతి ద్రోహులు.**
**- అన్ని రకాల ప్రభుత్వ నియామకాల్లో 11% వాటా మాదిగలకు ఇవ్వాలి.**
**- మహాత్మా పూలే ద్విశత జయంతి కమిటీలో మంద కృష్ణ మాదిగకు చోటు కల్పించినందుకు ప్రధానమంత్రికి కృతజ్ఞతలు.**
**- ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ.**
**- ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్క పల్లి రాజు మాదిగ.**



మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న ఏకైక కులం మాదిగలు మాత్రమే అని గత 12 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ చేస్తున్న ప్రకటన సత్యమని కుల గణన రిపోర్ట్ రుజువు చేసిందని, మా జనాభా 10% నుండి 11% ఉందని, ఎస్సీ వర్గీకరణలో కూడా మాకు అంతే వాటా కేటాయించాలని మంద కృష్ణ మాదిగ గతంలో లేవనెత్తిన ప్రశ్నలు సంపూర్ణ న్యాయమని కుల గణన రిపోర్ట్ తో స్పష్టం అయిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనవాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముక్కపల్లి రాజు మాదిగ అన్నారు.సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగం పల్లి శ్రీనివాస్ మాదిగ,ముక్కపల్లి రాజు మాదిగ , ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తో కలిసి మాట్లాడుతూ " తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదికలో మాదిగల జనాభా 10.3 % గా తేలిందని దానికి అనుగుణంగా ఎస్సీ వర్గీకరణలో 10 నుండి 11% రిజర్వేషన్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకువచ్చే సమయంలోనే 9% రిజర్వేషన్ వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని మంద కృష్ణ మాదిగ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు.అయినా రేవంత్ రెడ్డి ఆనాడు న్యాయం చేయలేకపోయారు.ఇప్పుడు వచ్చిన కుల గణన రిపోర్ట్ ద్వారా మాదిగల జనాభా శాతం గణంకాలతో సహా ఋజువైందని,ఇప్పుడైనా రేవంత్ రెడ్డి వైఖరిలో మార్పు తెచ్చుకొని న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం అని అన్నారు.సందర్భం వచ్చినప్పుడు న్యాయం చేస్తామని మాట్లాడిన ముఖ్యమంత్రి ఆ సందర్భం ఇప్పుడు వచ్చిందని గుర్తించాలని అన్నారు.మంద కృష్ణ మాదిగ జనాభా ప్రకారం మాదిగలకు 11% శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే ముఖ్యమంత్రి మెప్పు కోసం కొంత జాతి ద్రోహులు మాదిగ మేధావుల ముసుగులో 9% రిజర్వేషన్లను స్వాగతించి తీరని అన్యాయం చేశారని అన్నారు.అలాంటి ద్రోహులకు కుల గణన రిపోర్ట్ చెంప పెట్టు లాంటిదని అన్నారు.మాదిగల జనాభా శాతానికి కన్న తక్కువ శాతం రిజర్వేషన్లు రావడాన్ని స్వాగతించిన ద్రోహులు ఇప్పుడు మాదిగ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.కీలక ఘట్టంలో జాతికి వెన్నుపోటు పొడిచి తీరని ద్రోహం చేసిన వాళ్లకు జాతి గురించే మాట్లాడే నైతిక అర్హత లేదని అన్నారు.ద్రోహం ఎప్పటికైనా ఓడిపోతుందని సత్యమే ఎప్పటికైనా గెలిచి తీరుతుందని అన్నారు.జాతికి ద్రోహం చేసిన వాళ్లకు జాతి గురించి మాట్లాడే అర్హత ఇకపై లేదని అన్నారు.ఇక ప్రభుత్వం బహిరంగపరిచిన కుల గణన రిపోర్ట్ లో జనాభాలో మాదిగలు ప్రథమ స్థానంలో ఉన్నట్లుగానే దినసరి కూలీ పని చేసుకునే వారిలో, అలాగే భూమి లేని నిరుపేదలు అత్యధికంగా ఉన్న వారిలో కూడా మాదిగలే ప్రథమ స్థానంలో ఉన్నారు.ఇది మాదిగల పేదరికాన్ని, సామాజిక వెనుకబాటుతనాన్ని సూచిస్తుందని అన్నారు.గత 80 ఏళ్ల కాలంలో మాదిగలలో ఉన్న పేదరికాన్ని తొలగించడానికి ఏ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో పని చేయలేదని అన్నారు .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగలలో ఉన్న పేదరికాన్ని తొలగించడానికి తగిన సంక్షేమ పథకాల్ని ప్రవేశ పెట్టాలని, ప్రభుత్వ భూములను మాదిగలకు పంచాలని డిమాండ్ చేశారు.అన్ని రకాల ప్రభుత్వరంగ నియామకాల్లో 11% వాటా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.అత్యధిక జనాభా కలిగిన మాదిగలు శాసనమండలి లో , లోక్ సభ లో, రాజ్యసభలో, నామినేటెడ్ పోస్టులో ఒక్కరు కూడా లేరని, ఈ అన్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని అన్నారు.తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో బలమైన నిర్మాణాత్మక శక్తిగా ఎదగడానికి మరింత సంఘటితం కావాలని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహాత్మ జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాలను రెండు సంవత్సరాల పాటు నిర్వహించడానికి నిర్ణయం తీసుకుందని , అందుకోసం ప్రధానమంత్రి చైర్మన్ గా 126 మందితో కమిటీ ఏర్పాటు చేసిందని, ఆ కమిటీలో ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను సభ్యుడిగా నియమించడం జరిగిందని, అందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి యావత్తు మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు తెలిపారు.ఇది మాదిగలు ఇచ్చిన గుర్తింపు, గౌరవంగా బావిస్తామని అన్నారు.ఈ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. దేశంలో మొదటిగా మహాత్ముడిగా నిలిచిన పులే సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.పెర్క పర్శరాములు మాజీ జిల్లా ప్రెసిడెంట్ దండు శంకర్ వి హెచ్ పి ఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ,సామ్రాట్ ప్రకాష్ ఎం ఎస్ ఎఫ్ జిల్లా ప్రెసిడెంట్,చుంచు రమేష్ మాజీ జిల్లా అధికార ప్రతినిధి,జేరిపోతుల లక్ష్మణ్ మాదిగ, మాజీ జిల్లా వైస్ ప్రెసిడెంట్,బింగి పవన్ కళ్యాణ్ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి,బింగి నవీన్ ఉప సర్పంచ్,ఎల్లయ్య బీజేఆర్ ప్రెసిడెంట్ ,దండు నుకయ్య,గుండుకాడి బాబు,చింతమడక పర్శరములు,పొన్నాల కనుకయ్య,బింగి బాలకిషన్,బొత్త దుర్గయ్య,దాకాని కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# రసులాబాద్ గ్రామంలో వడ్ల కొనుగోలు ప్రారంభం.



మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

రసులాబాద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్ ఆధ్వర్యంలో పిఎసిఎస్ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు చెప్పడం జరిగింది మరియు సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో రాములు మాజీ సర్పంచ్ స్వామి గౌడ్ ఉప సర్పంచ్ సుదర్శన్ పంచాయతీ కార్యదర్శి బాల్ నర్సయ్య మల్లేశం బహుదూర్ పరుశురాములు శ్రీకాంత్ మంజుల లక్ష్మి గ్రామ పెద్దలు అబ్దుల్లా ఎల్లయ్య ఐలేని నర్సింలు భానుచందర్ శ్రీనివాస్ కనకయ్య అనిల్ స్వామి రమేష్ నరసయ్య అమాలి సంఘం కార్మికులు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తోనే సాధ్యం..

**- రామగళ్ళ నరేష్ సిపిఐ చేర్యాల మండల సహాయ కార్యదర్శి.**



మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే అది కేవలం కమ్యూనిస్టులతోనే సాధ్యమని సిపిఐ చేర్యాల మండల సహాయ కార్యదర్శి రామగల్ల నరేష్ అన్నారు ఇంటింటికి సిపిఐ అనే కార్యక్రమంలో భాగంగా చేర్యాల మున్సిపాలిటీలోని 11 వ వార్డు మరియు ఒకటో వార్డులో ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారం కై ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు ప్రజలు ఇచ్చే ప్రతి రూపాయి ప్రజా ఉద్యమాలకు ఉపయోగపడుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఇంటింటి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి నిధి సేకరిస్తున్నామని ఈ నిధి ప్రజా ఉద్యమాలకు ఉపయోగపడుతుందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ చేర్యాల మండలం కమిటీ సభ్యులు చుంచు అశోక్ ముస్త్యాల కనకబాబు , షేక్ యాసిన్, గిరిక అభినవ్ తదితరులు ఉన్నారు...

# కరీంనగర్ లో నీటి కోసం ప్రజల తిప్పలు.

**- ఎండలు తీవ్రం కావడంతో ఎండుతున్న బోర్లు**
**- ప్రతిరోజు నల్లానీరు ఇచ్చి ప్రజలను ఆదుకోవాలి**
**- ప్రజల నీటి కష్టాలు పట్టించుకోని నగర మేయర్**
**- సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు**

మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ రిపోర్టర్, మంద జయ ప్రకాష్ రెడ్డి.ఏప్రిల్ 17.



కరీంనగర్ నగరంలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నీటి బాధలు తీర్చాల్సిన మేయర్ ఏమాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు శుక్రవారంఒక ప్రకటనలో విమర్శించారు. ఎండాకాలం మొదలై తీవ్రంగా ఎండలు కొడుతున్న దృశ్య మానేరు డ్యామ్ లో నీటి కొరతతో చాలామంది నగర వాసుల బోర్లు ఎండిపోతున్నాయని నగర పాలక సంస్థ ఇవ్వాల్సిన నల్ల నీరు రెండు రోజులకు ఒకసారి గంట కూడా ఇవ్వకపోవడం వల్ల నగరములోని డ్యామును ఆనుకుని ఉన్న కోతిరాంపూర్, కట్టారాంపూర్,హనుమాన్ నగర్,తిరుమల నగర్, అలకాపురి, పోచమ్మ వీధి, లక్ష్మి నగర్,గణేష్ నగర్, భగత్ నగర్,రామచంద్రాపూర్ కాలనీ, సప్తగిరి కాలనీలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాయని నల్ల నీటిపై అధికారులతో రివ్యూ పెట్టి ఎక్కడెక్కడ నీటి అవసరాలు ఉన్నాయో పర్యవేక్షణ చేపించి నల్లా నీరు ఇవ్వాలని, వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మానేర్ డ్యామ్ కు ఆనుకుని ఉన్న ఇలాంటి కాలనీలే ఇంత ఇబ్బంది ఎదుర్కొంటున్నాయి అంటే నగరం మొత్తం ఏ విధంగా నీటి కష్టాలు ఎదుర్కొంటుందో అర్థం అవుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో నీటి వాడకం ఎక్కువ అవుతుందని ఇప్పుడే ఇలాగే ఉంటే మే నెలలో పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. మానేర్ డ్యామ్ కు మిడ్ మానేరు నుండి ఐదు టీఎంసీల నీరు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి తెప్పించుటకు నగరపాలక సంస్థ మేయర్ ప్రయత్నం చేయాలన్నారు. వెంటనే నగర మేయర్ నల్ల నీటిని ప్రతి ఇంటికి ప్రతిరోజు కనీసం ఒక గంట వచ్చేటట్లు ప్రణాళిక చేయాలని లేనిపక్షంలో నగర వాసులు తిరుగుబాటు చేస్తారని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

# కాకతీయ హైస్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డేలి



మేకార్తి దినపత్రిక సిద్దిపేట జిల్లా బ్యూరో ఇంచార్జి తాళ్ల రవీందర్ రెడ్డి ఏప్రిల్ 17

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ ఘనంగా నిర్వహించడం జరిగింది . ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిబిస్మాట్(బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ)స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గ మల్లారెడ్డి హాజరయ్యారు. అనంతరం జగ్గ మల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు నైతిక విలువలతో పాటు-సంస్కృతి సంప్రదాయాన్ని ప్రతిబింబింపజేసే కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రైమరీ విద్యార్థులకు ఉత్తీర్ణత సాధించినట్లు సర్టిఫికెట్స్ అందజేసి, వారికి ఉత్తేజాన్ని నింపడంతో పాటు, ఒక గుర్తింపుని ఇవ్వడం సంతోషదాయకం అన్నారు. చిన్ననాటి నుండి విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని, పురాణ ఇతిహాసాలను పరిచయం చేయాలని, మహనీయుల అడుగుజాడల్లో పయనించే విధంగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్య నేర్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తేవాలని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవిత ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల సర్కిల్, గంభీరావుపేట సెక్షన్‌లో 3.0 కి.మీ. 33కేవీ ఇంటర్‌లింక్ లైన్ విజయవంతంగా చార్జ్

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండల పరిధిలోని కొత్తపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించే మహత్తర లక్ష్యంతో 3.0 కిలోమీటర్ల పొడవైన 33కేవీ ఇంటర్‌లింక్ లైన్‌ను విజయవంతంగా శుక్రవారం చార్జ్ చేశామని ఎన్పీడీసియల్ చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్-1), బి. అశోక్ తెలిపారు.విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన ఈ ఇంటర్లీకింగ్ లైన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్), సిరిసిల్ల టి. వేణు మాధవ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, వారి సమక్షంలో అత్యంత విజయవంతంగా నిర్వహించబడిందనీ అన్నారు.ఈ ఇంటర్‌లింక్ లైన్ ప్రారంభంతో కొత్తపల్లి, శ్రీగాధ, కొల్లమడ్డి, రాజుపేట గ్రామాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని అశోక్ స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడినప్పుడు లేదా భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రధాన విద్యుత్ లైన్లలో అంతరాయాలు సంభవించినప్పుడు, ఈ ఇంటర్‌లింక్ లైన్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గంలో నిరవధికంగా విద్యుత్ సరఫరా కొనసాగించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. దీని వలన గ్రామీణ ప్రాంత వినియోగదారులకు కరెంటు అంతరాయాలు గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో నిరంతరత సాధించడం వలన ఈ గ్రామాల రైతులకు వ్యవసాయ విద్యుత్ సకాలంలో అందుతుందని, గృహ వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సేవలు లభిస్తాయని, స్థానిక చిన్న పరిశ్రమలకు వ్యాపారాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందని అశోక్ వివరించారు. ఈ ఇంటర్‌లింక్ లైన్ ఏర్పాటు వలన విద్యుత్ వ్యవస్థలో రెండు మార్గాల సరఫరా అందుబాటులోకి వచ్చిందని, ఇది ఆధునిక విద్యుత్ పంపిణీ వ్యవస్థకు ఒక మైలురాయి అని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో, అత్యంత నేర్పుతో విజయవంతంగా పూర్తిచేసిన గంభీరావుపేట సెక్షన్ సిబ్బందిని,సంబంధిత ఇంజినీర్లను సీఈ బి. అశోక్ , ఎస్ఈ టి. వేణు మాధవ్ అభినందించారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులకు అంతరాయాలు లేని



నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ విభాగపు అత్యున్నత లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం శ్రమిస్తామని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సర్కిల్ పరిధిలోని ఇతర సబ్‌స్టేషన్లకు కూడా ఇలాంటి ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్) టి. వేణు మాధవ్ , డివిజినల్ ఇంజినీర్ ఎన్. అంజయ్య , అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ శ్రీనివాస్ , అసిస్టెంట్ ఇంజినీర్లు శ్రీ ఆనంద్, పద్మ మరియు గంభీరావుపేట సెక్షన్ సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చుంచనకోట గ్రామములో చలివేంద్రం ఏర్పాటు చేసిన సర్పంచ్ గొర్రె శ్రీనివాస్.

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.




చుంచనకోట గ్రామంలో వేసవికాలం దృష్ట్యా స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటిని అందించే కార్యక్రమం సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ సమక్షంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో ఉపసర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య , పంచాయతీ కార్యదర్శి రాజు , వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## ఫోటో ఢ వీడియో గ్రాఫర్స్ యూనియన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా రాచర్ల వేణు కుమార్

మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండలం రిపోర్టర్



గంభీరావుపేట మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాచర్ల వేణు కుమార్ ఉధ్యక్షుడిగా దుంపటి సాయి కుమార్, కోశాధికారిగా గుమ్మల రాజు, ప్రచార కర్తగా రాచర్ల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాచర్ల వేణు కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వృత్తిపరంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, ఫోటోగ్రఫీ రంగాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఫోటో మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొని, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పి ఆర్ సి అమలు చేయాలని నిరసన



మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టిజిఈ జెఏసి పిలుపుమేరకు తక్షణమే పి ఆర్ సి అమలు చేయాలని,పెండింగ్ లో ఉన్న డి ఏ లను విడుదల చెయ్యాలని, సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలు చెయ్యాలని ఈ హెచ్ ఎస్ కార్డ్స్ అమలు చేయాలి ని ఈరోజు నల్లబ్యాడ్జీలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేట నందు నిరసన కార్యక్రమం నిర్వహించనైనది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ విజయలక్ష్మి . మరియు అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయాలి




మేకార్తి దినపత్రిక ఏప్రిల్ 17 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో టీజీఇ జాక్ పిలుపు మేరకు శుక్రవారం రోజు గంభీరావుపేట తాసిల్దార్ ఆఫీస్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని కన్వీనర్ తాసిల్దార్ మారుతి రెడ్డి చైర్మన్ బోయన్న గారి నారాయణ టిఆర్టిఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లు తెలియచేసారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యానుఫెస్టోలో తెలిపిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు ప్రభుత్వము వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడం శోచనీయమన్నారు ఇప్పటికైనా వెన్వెంటనే స్పందించి 51% తోటి పిఆర్సి అమలు చేయాలి సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ ని అమలు చేయాలి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించుటకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో పెద్ద మొత్తంలో టీచర్లు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు

# గొప్ప గురువు...రాధాకృష్ణన్

– వికుర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయులు



వేములవాడ, ఏప్రిల్ 17, మేకార్తి దినపత్రిక ప్రతినిధి : భారతీయ తత్వవేత్త, గొప్ప విద్యావేత్త మరియు మొదటి ఉపరాష్ట్రపతి ( 1952-62), రెండవ రాష్ట్రపతి (1962-67)గా పనిచేసిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్ 51వ, వర్ధంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలను పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "భారతీయ తత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన రాధాకృష్ణన్ సెప్టెంబర్ 5న ( జన్మదినం)ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకుంటామని, ఆయన 150 కి పైగా రచనలు చేశారని, మైసూర్, కలకత్తా విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ గా పనిచేసి, తత్వశాస్త్రంలో భారతీయతను బోధించారని, 1962 నుండి 1967 వరకు భారతదేశ రెండవ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారని, రాధాకృష్ణన్ జన్మదినమైన సెప్టెంబర్ 5న ఆయన గౌరవార్థం దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారని, 'ఇండియన్ ఫిలాసఫీ', 'ది హిందూ వ్యూ ఆఫ్ లైఫ్'వంటి150కి పైగా ప్రభావవంతమైన పుస్తకాలు రాశారని, భారత ప్రభుత్వం ఆయనకు 1954 లో అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ను ప్రధానం చేసిందని, విశ్వవిద్యాలయ కమిషన్ అధ్యక్షుడిగా ఉన్నత విద్యారంగ అభివృద్ధికి కృషి చేశారని, రాధాకృష్ణన్ కూడా అందరిలా జన్మించినా స్వశక్తితో ,అసాధారణ ప్రజ్ఞా పాటవాలతో ఉన్నత శిఖరాలకు ఎదిగి పలువురికి మార్గదర్శకంగా, తన వృత్తి ధర్మానికి మకుటంగా వెలిగారని, సర్వేపల్లి ది కొని తెచ్చుకున్న గౌరవం కాదు, కొలిచి తెచ్చుకున్న గౌరవం అని, వృత్తిరీత్యా, వ్యక్తిత్వ రీత్యా, సంస్కార రీత్యా ఆయన్ని వరించిందని, ఏ పనిలోనైనా నిబద్ధత కలిగి ఉండాలని ఆయన జీవితం మనకు పాఠంగా చెబుతుందని, సర్వేపల్లి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఇమోపిలియా దినోత్సవం

– రోగ నిర్ధరణ అవగాహన

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత రాజన్న సిరిసిల్ల అధ్యక్షతన ప్రపంచ హిమోపిలియా దినోత్సవం 17 ఏప్రిల్ సందర్భంగా సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నుంచి గాంధీ చౌక్ వరకు హిమోపిలియా అవగాహన ర్యాలీ నిర్వహించినారు.

మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ 17 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ఈ సందర్భంగా జిల్లా వైద్యా శాఖ అధికారి మాట్లాడుతూ హిమోపిలియా అనే వ్యాధి శరీరంలో రక్తస్రావం జరగడం చేత రక్తం గడ్డ కట్టే అవకాశం లేకపోవడం చేత రక్తస్రావం జరుగుతుందని, ఈ వ్యాధి తల్లిదండ్రుల నుండి పిల్లలకు వచ్చే వ్యాధి, చిన్నపిల్లల లో దెబ్బ తగిలిన ఎక్కువగా కనిపిస్తుంది, మోకాలు, మడిమలలో రక్తస్రావం జరిగినట్లయితే కీళ్లు పనిచేయవని, తరచూ రక్తస్రావం జరగడం వల్ల పిల్లలలో రోజువారి పనులు చేయలేకపోవడం, గర్భాధారణ సమయంలో సరైన పరీక్షలు నిర్వహించుకోవాల్సిందిగా, సరియైన సమయంలో హిమోఫిలియా వ్యాధికి చికిత్స అందించి అవయవాల లోపాలను అరికట్టవచ్చని, రెగ్యులర్ గా చెకప్ లు చేయించుకోవాల్సిందిగా, ఈ వ్యాధికి పరీక్షలు, టెస్టులు, చికిత్స చేసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా హిమోఫిలియా వ్యాధిపై అవగాహన ర్యాలీ ఉద్దేశించి తెలిపినారు. ఈ ర్యాలీలో సిరిసిల్ల జిల్లా పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ రేఖ, డాక్టర్ సాహితీ మరియు ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.



## జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజ్యంను సాల్వతో సన్మానం చేసిన

– అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుర్ర సావిత్రి

మేకార్తి దినపత్రిక, ఏప్రిల్ 17 ముస్తాబాద్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో శుక్రవారం జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మరాజం అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. సందర్శన అనంతరం వారు మాట్లాడుతూ అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహిస్తున్న ఈ సేవలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఇక ముందు కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ మరింత విస్తృతంగా ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఫౌండేషన్ సభ్యులను అభినందిస్తూ వారి సేవా భావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించగా, ఫౌండేషన్ సేవలకు మరింత ప్రోత్సాహం లభించనుందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గౌరవ సర్పంచ్ శంకర్ జిల్లా సంక్షేమ అధికారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ ఫౌండేషన్ అధ్యక్షురాలు కూర సావిత్రి, ఉపాధ్యక్షులు పి.స్వరూప, సెక్రటరీ బి.పద్మ మరియు సభ్యులు పి.రమ్య, బి.విజయలక్ష్మి, ఉప సర్పంచ్ నవీన్ నాయకులు శ్రీనివాస్ రావు మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎండాకాలం జాగ్రత్తలు తెలియజేయాలి

– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

– సిరిసిల్ల అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

మేకార్తి దినపత్రిక,ఏప్రిల్ -17 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే జాగ్రత్తలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## టీజీ జాక్ ఆధ్వర్యంలో బాలరాజు పల్లి స్కూల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన.,,

వేములవాడ ఆర్ సి, ఏప్రిల్ 17, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :

టీజీజాక్ రాష్ట్ర కార్యవర్గంలో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయులు, కార్మికులు మరియు పెన్షనర్ల ఆధ్వర్యంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న

**టీజీజాక్ ప్రధాన డిమాండ్లు**

1) జూన్ రెండు వరకు పిఆర్సి అమలు చేయాలి

2) రిటైర్ అయిన ఉద్యోగుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

2) ఇ ఫ్ స్ హెల్త్ కార్డులను తక్షణమే అమలుపరచాలి

4)2004 సెప్టెంబర్ 1 తేదీకి ముందు నియాకమైన ఉద్యోగులకు ఓ పి స్ ను అమలు చేయాలి పాత పెన్షన్ అమలు చేయాలి

5) ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు మరియు ప్రధానోపాధ్యాయుని ఉండేవిధంగా ప్రాథమిక పాఠశాలకు కేటాయించాలి

6) సి పి స్ రద్దు పరచి వెంటనే ఓ పి స్ అమలు చేయాలి



డిమాండ్ల పరిష్కారానికై టీజీజాక్ నిర్ణయించిన కార్యాచరణలో భాగంగా, వేములవాడ రూరల్ లోని బాలరాజ్ పల్లి ప్రాథమిక పాఠశాల లో 17-04-2026 (శుక్రవారం) న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన. తెలియజేస్తున్న ఉపాధ్యాయులు పులి రామ్ గోపాల్ గౌడ్, రాజేశం, మధుకర్, అనిత; లతికా మొదలగు పాల్గొన్నారు

